# శ్రీ దే వి

శ్రీమతి బారు సరోజినీదేవి

"ఆరోజున అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చింది శ్రీ. ఇంక పనేమిసాగలేదు. వ్రాస్తూన్న కాగితాలన్నీ అలాగేవదలి కుర్చీలోజారబడి కళ్లుమూసుకున్న కళ్ల ఎదుట నవ్వుతూనిల్చున్నట్లేవుంది నా శ్రీ. ఆఫీసులో వుండబుద్ధిపుట్టలేదు. సైకలుతీసుకొని జవానునైనా పిలవకుండగా ఇంటికివచ్చా, నా పెట్టెలో జాగ్రత్తగా పట్టురుమాలలో కట్టియుంచిన ఫోటోతీసి చూస్తూవుండిపోయాను. కళ్లునీళ్లతో నిండిపోయాయి. శ్రీ. జాతకము, చెయ్యిచూచిన జ్యోతిష్కులందరు ఎంతో అదృష్టవంతురాలని, గొప్పది అవుతుందని ఎన్నోచెప్పారు. కాని ఏదినిజంగా ఆపాపం అంతానాదే అనిపిస్తుంది. ఎంతద్రోహం చేశాను. శ్రీ నీకు! అయ్యో నేను ఎంతదుర్మార్గుణ్ణి ఎంతపిరికివాణ్ణి! తెగించలేకపోయాను. నీజీవితం పాడుచేశాను. శ్రీ నన్ను నువ్వు ఎంతనిందించావో, ఎంతవిచారించావో, నాలాంటి నిర్భాగ్యుడికి నీలాంటి మణి దక్కకూడదని భగవంతుడు ఇలాచేశాడు. నేను దరిద్రుణ్ణి నీలాంటి శ్రీదేవి నాదగ్గర ఎలాగుంటుంది. అందుకనే నన్నువిడచి వెళ్లిపోయావు. శ్రీ అయ్యో ఇంక ఎక్కడ శ్రీ. నన్నువదలి అప్పుడే 2 సంవత్సరాలైపోయాయి. ఈ పది, పన్రెండు నెల్లనుంచి నీజ్ఞప్తిలేకుండ ఈ సంసారకూపంలో పడిపోయాను. నీకు కోపంవచ్చిందా? కాని నామీద నీకు కోపం వుండదు. అలాకోపంవుంటే ఇలానవ్వుతూ నాదగ్గరకు రానేరావు. నాకోసం నీప్రాణాన్నికూడ ఇచ్చావు. అయ్యో నా శ్రీ ఇంకనువ్వులేవు. ఈనీచుడుమాత్రం జీవచ్ఛవంలాగ ఉన్నాడు. కళ్ళనీళ్లు విపరీతంగా వస్తున్నాయి. అలాగే ఈజీచైరులో కళ్లుమూసుకొని ఫోటో గుండెలమీద పెట్టుకొని పడుకొన్నాను. "అయ్యో అదేమిటండీ అలా కళ్ళనీళ్లు కారుస్తూ పడుకొన్నారు," అంటూ నాకళ్లనీళ్లు తుడుస్తూ నాచేతిలోవున్న ఫోటోతీసింది మాఆవిడ. నేనేమి మాట్లాడకుండా అలాగే కూర్చున్నాను. "ఎవరండీ ఈఫోటో" అంటూ వెనక్కుత్రిప్పి పేరు చదివి "ఓ.హో శ్రీదేవిఅంటే ఈమేనా ఇన్నాళ్లనుంచి నాకు చూపించకుండగా దాచిపెట్టారా?" నేనేమి మాట్లాడలేదు. 'ఏమవుతుందండీ మీకు.' నేను ఆమె ముఖంలోకిచూస్తూ "ఆమెనాకు ఏమవుతుందో చెప్పలేనుకాని నేనుమాత్రం ఆమెకు మృత్యుదేవతనయ్యాను పద్మా అన్నా" విచారంగా. "ఎందుకండీ అలాఅనుకుంటారు; అసలుసంగతిఏమిటో నాకు చెప్పండి." "ఏంచెప్పమంటావు. చెప్పాల్సివస్తే నేను దుర్మార్గుణ్ణి; ఒక అమాయకురాలిప్రాణంతీసిన పాపాత్ముణ్ణి అని చెప్పాలి." "అదుగో మళ్లీ ఆమాటేనా. ఎందుకు మిమ్మలని మీరు అలా తిట్టుకుంటారు. మీవాళ్లందరు శ్రీదేవిని మీగురించి ఏమోచెప్పుకుంటూనేవుంటారు. నాకేమి తెలియలేదు. మిమ్మలిని అడుగుదామంటే భయంతో వూరుకొన్నాను. కాని ఇంక ఈరోజు చెప్పకతప్పదు" అంది పద్మ పట్టుదలతో "అలాగేచెపతాను పద్మా" అన్నా కళ్లుతుడుచుకుంటూ. "తన చేతిలో ఫోటో స్టూలుమీద పెట్టి" ఉండండి కఫీ తీసుకొస్తాను" అని లోపలకి వెళ్ళింది.

"నేను శ్రీదేవి చిన్నప్పటినుంచీ అంటే జ్ఞానం తెల్సిన దగ్గరనుంచీ ఒకచోట పెరిగాము. ఒక్క స్కూలులోనే చదివేవారం. నాకన్న శ్రీ అయిదు సంవత్సరాలు చిన్న. మా బంధువులందరూ శ్రీని నాకిచ్చి పెళ్ళిచేయాలనుకునేవారు. మేమిద్దరం దెబ్బలాడుకొనేవారం, ఆడుకునేవారం, ఒకచోటే కూర్చుని చదువుకొనేవారం, చాల స్నేహంగా, ప్రేమగా నుండేవాళ్ళం. కాని భార్యాభర్తలంటే ఏమిటో తెలియదు. ఎప్పుడయినా శ్రీమీద కోపం వస్తే నిన్ను పెళ్ళిచేసుకోనని బెదరించేవాణ్ని. దాంతో ఏడుస్తూ వాళ్ల అమ్మతో ఫిర్యాదుచేసేది. వాళ్లు ఆ ఎందుకు చేసుకోడు కాళ్లుచేతులుకట్టి నీపక్కన కూర్చోపెట్టి పెళ్ళిచేస్తాము. అనేవారు. మా నాన్నగారు ఎప్పుడయినావసే శ్రీ వాళ్ల అమ్మ చూడు వీళ్ళిద్దరకూ పెళ్ళిచేస్తే బాగుంటుంది అనేది. మేమిద్దరము ఒక్కచోట కూర్చుని చదువుకొంటూ

వుంటే చూడు భార్యా భర్తలిద్దరూ ఒక చోట కూర్చుని చదువుకుంటున్నారు అని మా నాన్నగారితో వాళ్ళఅమ్మ అనేది. కాని ఆయన "చిన్నప్పుడు అలా అనకూడదమ్మా" అనేవారు. ఆయన మనస్సులో ఇంత విషముందని ఎవరికి తెల్సును.

ఎస్. ఎస్. ఎల్. సి ప్యాసయినాక నేను ఆ వూరునుంచి వెళ్ళిపోయా. మా నాన్నగారు ఏవో సంబంధాలు తీసుక్కురావడం, నేను పెళ్ళి చేసుకోను అనటం జరిగింది. తిర్గి 2 సంవత్సరాలకు మా బంధువులున్న వూరేవచ్చి కాలేజీలో చేరాను. శ్రీ కూడ పెద్దదయింది. వాళ్ళవాళ్లు పెళ్ళిచేస్తామంటే ఏడుపుట. పెళ్ళిచేసుకోను చదువుకుంటాను అనేదట. ఒక రోజున నన్ను పెళ్ళిచేసుకుంటావా అని వాళ్ళవాళ్లు అడిగితే ఊ అందిట. నేను అక్కడకు వచ్చాక ఒకరోజున నన్నుపిల్చి పెళ్లివిషయం ఏంచేశావు? మీ నాన్నగారు చాలాసంబంధాలు చూశారు చేసుకోలేదేం? అన్నారు. "నాకుఇంకా చేసుకొనే ఉద్దేశ్యములేదు. అయితే శ్రీకిపెళ్లి ఎప్పుడు" అన్నా నవ్వుతూ ఆమెకేసిచూస్తూ. "అది పెళ్లి చేసుకోదట" అన్నారు. ఆమె కొంచెంసేపు ఈమాట ఆమాటఅయ్యాక శ్రీని నాకివ్వటంవచ్చింది. 'నీఅభిప్రాయం ఏమిట'న్నారు. నేను నవ్వుతూ ఆమెగారు అసలు పెళ్లి చేసుకోదుగా ఇంక నాఅభిప్రాయం ఎందుకు అన్నాను. నీసంగతిచెపుదూ అన్నారు. నేను శ్రీనితప్ప ఇంకఎవ్వరిని చేసుకోతల్చుకోలేదు. అయినా ఆదేవిగారి ఉద్దేశ్యం తెలుసుకోవద్దు అన్నా. చెప్పమ్మా నీ అభిప్రాయం, నిన్ను పెళ్లి చేసుకొంటాడుట, మరి నువ్వుకూడ చెప్పఅన్నారు. ఆమె సిగ్గుతో తలవంచుకొని ఊ అని అవతలకు వెళ్లిపోయింది.

నామనస్సులో ఏలావుండేదో నాకే తెలియదు కాని శ్రీ అంటే మాత్రం ప్రేమగానేవుండేది. కలసి చదువుకొనేవాళ్లం, సినీమాలకు వెళ్లేవాళ్లం, నాపెట్లో డబ్బులుగాని, తినేవస్తువులుగాని తనకి ఏంకావలసినా స్వతంత్రంగా తీసుకొనేది. తనదగ్గర నుంచికూడ నేనుస్వతంత్రముగా తీసుకొనేవాడిని. ఇద్దరం చాల కలసి మెలసి వుండేవాళ్లము. ఇలా ఏవడిదుడుకు లేకుండగా సంవత్సరం గడిచింది. మా నాన్నగారువాళ్లు మాత్రం నామీద శ్రీతల్లి తండ్రులమీద, శ్రీమీదకూడ కారాలు మిరియాలు నూరుతున్నారు. నాన్నగారు చాల విషపాలోచన గల మనిషి. అందువల్ల పైకితేల్చకుండా లోపల్లోపలే వుంచారు. ఎప్పుడయినా చూచాయిగా అంటూ వుండేవారు. నేనుకూడ నా అవసరం తీరడానిక్కి వాళ్లింట్లో గడుపుకొంటున్నాను. ఈసంగతులన్నీ శ్రీతల్లి తండ్రులు గ్రహించి కొంచెం ముభావంగానే వుండేవారు. ఆఖరకు అందరిమనస్సులోను తుఫాను రేగింది. నేను ఆ తర్వాత చదువుకి చాల దూరదేశం వెళ్లేను. అక్కడనుంచి ప్రారంభ మయింది నాటకం. నేను నీకు ఫలాన సంబంధము నిశ్చయించాను. ఈశలవ్వులలో నీపెళ్లిచేసి తీరాలి. నీవు అడ్డు చెప్పటానిక్కి వీలులేదు అని మా నాన్నగారు వ్రాశారు. నేను ఇప్పుడు పెళ్లి చేసుకోనని జవాబు వ్రాశాను. దాంతో ఆయన కోపంతో నేచెప్పిన పిల్లను చేసుకోపోతే నీకు నాకు ఏం సంబంధము లేదు. నీవుచచ్చినవాడితో సమానము. నాకుపుట్టలేదనుకుంటాను. అంటూ నిష్టూరంగా వుత్తరాలు వ్రాశారు. నేనుజబాబు వ్రాయలేదు. ఆఖరుకు శ్రీ మీద లేనిపోని అపనిందలు వేస్తూ వ్రాశారు. ఆ ఉత్తరాలుచూసి శ్రీ మీదకూడ దురభిప్రాయ పడ్డాను. కాని నామనస్సు పొరపాటుఅనే చెప్పతోంది. నాలోంచి శ్రీ ని వేరుచేయలేక పోతున్నాను. శ్రీ తల్లి దండ్రులు అట్టే భాగ్యవంతులు కారు. అందువల్ల మా నాన్నగారు చెప్పినట్లు కట్నము లేకుండా నాకు అంటకట్టాలని చూస్తున్నారేమోనని నేను దురభిప్రాయపడ్డాను. అందువల్ల నన్ను మాటలుచెప్పి తమ వలలో వేసుకొన్నారు అనుకొన్నాను. ఎన్ని ఆలోచించినా శ్రీ ని మాత్రం నాహృదయంలోంచి తీసివేయలేకుండగా నున్నాను. పాపం ఆచిన్న హృదయం, అమాయక శ్రీ అప్పుడు ఎంత బాధపడేదో ఇప్పుడు అనుకుంటే ఏంలాభం? పెద్దలు అన్నీ తెలిసినవాళ్లే అందులో తల్లిదండ్రులే తమ బిడ్డలను ఈలా ఖూనీ చేస్తారంటే ఎవరు నమ్మతారు? మళ్లా మానాన్నగారు ఉత్తరం వ్రాశారు.

నేను స్థిరపరచిన సంబంధము చేసుకోకపోతే దీంతో నీకు నాకుసరి అని. దానిక నేనుజబాబు ఇవ్వలేదు. దాంతో నాకు ఆయన 3, 4 నెలలు డబ్బుపంపడము మానివేశారు. శ్రీని పెండ్లిచేసుకొంటే చదువుకి వాళ్లనే డబ్బు పంపమని వ్రాయమన్నారు. 4 నెలలు డబ్బులేక చాల ఇబ్బంది పడ్డాను. ఇంక తండ్రికి లొంగక తప్పిందికాదు. నాన్నగార్కి ఉత్తరం వ్రాశాను. చెప్పినట్లు వింటాను. మీ ఇష్టమువచ్చిన పిల్లను చేసుకుంటాను. ఇంకా ఏదో నాచేతికి వచ్చినట్లు వ్రాసిపడేశా దాంతో నాకు చదువుకి డబ్బువచ్చింది. పరీక్షలయిపోయాయి. ఇంక యింటికి వెళ్లడమంటే పెద్దనిప్పుగుండంలోకి దూకుతున్నట్లున్నది. ఇంటికి వచ్చినాను మావాళ్లు అందరు చాల సంతోషించారు. ఇంట్లో నన్నుచూని గుసగుసలు ప్రారంభమయాయి. నేను అంతాకని పెడుతూనే వున్నాను. ఎప్పుడో వుప్పెన వచ్చి పడుతుందని నామాటలన్నీ జాగ్రత్త చేసుకొంటు న్నాను.

ప్రొద్దుట కాఫీ త్రాగుతున్నాను. నాన్నగారు వచ్చి 'అబ్బాయి ఆఫీసుగదిలోకి ఒకసారి రా' అన్నారు. గుండెలు దడదడ మంటూ మెల్లగా వెనకాలేవెళ్లి కుర్చీలో కుర్చున్నాను. చూడు 'త్వరగా డ్రస్సువేసుకో పిల్లను చూచి వద్దువుగాని' అన్నారు. నేను తెల్లపోతూ 'ఏపిల్ల' అన్నాను. ప్రొఫెసర్ గారి అమ్మాయి నేను, అమ్మా, అక్కయ్యలు అందరము చూచివచ్చినాము మాకుపిల్ల నచ్చింది. ఈనెల 15 తా॥ ముహూర్తము నిశ్చయించాం, ఆమాటలువినేసర్కి నాకు ఒళ్లుమండిపోయింది, 'పెళ్లిచేసుకొని బ్రతికి ఉన్నన్నాళ్లు కష్టసుఖములు అనుభవించేవాడను నేను. ఇదేమన్నా ఆటలా బొమ్మలపెళ్లిచేయటమా' అన్నాను. దాంతో ఆయన తారామండలానికి లేచినారు. ఛీ దుర్మార్గుడా నీముఖం నాకుచూపించకు పోనా యింట్లోంచి పో అంటూ పెద్దపెద్ద కేకలు ఇల్లెగిరి పోయేలాగున వేస్తున్నారు. ఇంట్లో అందరూ మాచుట్టూమూగారు, నేనుమాట్లాడకుండగా తలవంచుకొని కట్టుకొన్న బట్టలతోనే బయటకు వెళ్లిపోయాను. ఏవూరయినా వెళ్లిపోదామని తిన్నగా స్టేషనుదగ్గరకు వెళ్లి కూర్చున్నాను. ఇంతలో మాజవాన్లువచ్చి అమ్మగారు ఏడుస్తున్నారని నన్ను తిరిగి బతిమాలి ఇంటికి తీసుకొచ్చారు. ఏలాగో 15 రోజులు గడిపాను. ఇంతలో ఉద్యోగానికి ఆర్డరు వచ్చింది. బ్రతుకుజీవుడా అని నరకకూపంలోంచి బయటకు పడ్డాను. కాని ఏపండగ శెలవలకయినా యింటికి వెళ్లడం, వెళ్లగానే ఇంట్లో పెండ్లిగొడవ రావడం దాంతో నాకు అక్కడ సుఖం లేకపోవడం ఇలా సంవత్సరము గడిచింది. నాకు మా నాన్నగారు పెండ్లికూతుర్లను చూడడం నేను ఎలాగో తప్పించుకోవడం జరుగుతూ వుండేది. తెగించి శ్రీని చేసుకోలేను; తండ్రిమాట కాదనలేకుండా వున్నాను.

అకస్మాత్తుగా శ్రీ దగ్గరనుంచి తనకు జబ్బుగా వుందని ఒక్కసారి రమ్మనమని ఎంతో ప్రాధేయపడుతూ ఉత్తరం వ్రాసింది. దుర్మార్గుణ్ణి వెళ్లి చూడలేకపోయాను. వెళ్లాలని అనుకొన్నాను కాని రాక్షసిలాగ తండ్రి తలపుకువచ్చి ఆ కోర్కె విరమించుకొన్నాను. జబాబు అయినా వ్రాయు లేదు, మా నాన్నగారు వచ్చినప్పుడల్లా నాకు బోధచేసేవారు వాళ్లు నిన్ను వలలో వేసుకొన్నారని వాళ్ల మాటలలో పడకని ఏవేవో చెప్పేవారు. అన్నిటికి ఊ అనే సమాధానము యిచ్చేవాడిని. ఈ ఉత్తరము అందుకనే ఇలా వ్రాసిందేమో అని అనుకొన్నాను. తండ్రిమాట కాదనలేక శ్రీ దేవిని పెండ్లిచేసుకోలేకపోతున్నాను. పోనీ శ్రీని కాదని తండ్రిమాటవిని ఇంకో పిల్లను చేసుకోలేకపోతున్నాను. ఎటుకాకుండగా కుడితిలోపడ్డ ఎలుకలాగ, కొట్టుకునేవాడిని. సంపాదించుకొంటున్నా సుఖంలేకుండ బాధపడేవాడ్ని. ఆ రోజులు తల్చుకుంటూంటే ఇప్పుడుకూడ దడవస్తూంది.

ఒక రోజున అర్జంటుగా టెలిగ్రాము వచ్చింది. శ్రీ మరణశయ్యమీదవుంది వచ్చిచూడమని. నాకు మతిపోయింది. మా నాన్న చెప్పినట్లు. ఇది దొంగ టెలిగ్రామెమో అనుకొన్నాను. ఆలోచించాను; మతిలేదు; వెళ్లనా-మాననా ఏది తేలకుండగానే మనస్సులోనే బాధపడుతున్నాను. పైకి ఏమ

యినా అంటే మా అక్క చెల్లెళ్లు ఏమయినా అంటారేమో అని భయము. ఇంత పిరికిగుండెవాడ్ని నేనేం చెయ్యగలను చెప్పు? నాపిరికితనమే, నా భయమే శ్రీకి మృత్యువయినాయి. ఇంక చెప్పలేక వెక్కి, వెక్కి ఆడదానివలె ఏడ్చా. "అయ్యో ఎందుకలా ఏడుస్తారు భగవంతుడు అలా చేశాడు. మీరేం చెయ్యగలరు? ఇంతకు కర్మ" అంటూ తనకళ్లనీళ్లు తుడుచుకొని నాకళ్లుతుడిచి "ఇంక తర్వాత సంగతి చెప్పండి. ఇంతకు వెళ్లారా? లేదా?" రెండవరోజు మళ్లీ టెలిగ్రామ్. దయచేసి 'ఒక్కసారి రావలెను; అర్జంటు.' ఇంక ఉండలేకపోయాను వెంటనే బయలుదేరి వెళ్లాను.

గుండె దడదడలాడుతూంది. కాళ్లు ఒణుకుతున్నాయి; మెల్లగా లోపలకు వెళ్లేను. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. నాజోడు చప్పుడువిని శ్రీతల్లి బయటకు వచ్చింది. నన్నుచూచి గుడ్ల నీరు కుక్కుకుంటూ పక్కగదిలోకి వెళ్లమని సౌజ్ఞచేసి వెళ్లిపోయింది. గదిగుమ్మంలోకి వెళ్లేను నాకళ్లను నేను నమ్మలేకపోయా ఏమని చెప్పను పద్మా నా శ్రీ శవాకారంలా మంచంలోపడివుంది. చుట్టూ డాక్టర్లు, ఇంట్లోవాళ్లు నిలుచున్నారు. నన్ను చూడగానే అందరు ఒకరిమొగాలొకరు చూచుకొని అందులో ఒకాయన నన్ను చెయ్యిపట్టుకొని శ్రీ మంచం దగ్గరకు తీసుక్కెళ్లేరు. నావళ్లు నాకు తెలియని పరిస్థితులలోనున్నాను. 'శ్రీ నొక్కసారి పలకరించు నాయనా' అని వాళ్లు అనేవరకు నేను ఈ ప్రపంచకములోపడలేదు. చూడమ్మా శ్రీ మీ ...వచ్చాడు వక్కసారి కళ్లుతెరు. రోజూ అడుగుతున్నావు! అని వాళ్లు ఆమె చెవిలో రెండుమూడుసార్లు చెప్పాక మెల్లిగా కళ్లుతెరిచింది. 'శ్రీచూడు ఇదిగో నేను వచ్చాను, కళ్లుతెరు; మాట్లాడు నాతో ఒక్కసారి' అంటూ కళ్లనీళ్లతో మాట్లాడలేకపోయాను. ఆమె మెల్లిగా నాచేతిని తన చేతిలోకి తీసుక్కొని మంచినీళ్లని సంజ్ఞచేసింది. నేనే రెండు చెంచాలు నోట్లోపోశాను. తన చేతులతో నా కన్నీళ్లుతుడుస్తూ 'అబ్బా ... హా ... ఇన్నాళ్లకు వచ్చావా.. నన్ను ... మర్చిపో ... అమ్మా ఆయాసం...హా... నేను ... వెళ్లి ... పోతున్నా నాతప్పులు ... క్షమించు ... హా ... మీనాన్నగారు ... చెప్పినపిల్లను ... పెండ్లిచేసుకో...అదే మనసుకు ... శాంతి ... హా ... నిన్నుచూశా ... శలవ్ ... ర్గామా' మాట్లాడలేకపోయింది. ఆయాసంతో బాధపడుతూ కళ్లుమూసుకొంది. ఇంక చెప్పలేకపోయా; చేతిరుమాలు కళ్లుకడ్డంపెట్టుకొని వుండిపోయాను. పద్మకూడ ఇంక మాట్లాడలేక వెక్కి, వెక్కి ఏడుస్తూంది. అలా ఎంతసేపు వున్నామో మాకే తెలియదు. ఇంతలో ప్రక్కింటి అక్కగారువచ్చి "ఏంబాబు! ఏమిటి సంగతి; పద్మా అందరు క్షేమంగావున్నారా?" అని పలకరించినదాకా మాకు తెలివిరాలేదు. పద్మ కళ్లుతుడుచుకుంటూ ఆమెను కూర్చోపెట్టి సంగతిఅంతాచెప్పి ఫోటో చూపించింది. ఆమెకుకూడ కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ప్రపంచకములో "ఎంతటివాళ్లయినావున్నారు తల్లీ; నీమామగారు ఎంత దేవాంతకుడో, నిష్కారణంగా ఒక అమాయిక ప్రాణాన్ని తీశాడు. చూడుబాబూ ఎంత సుఖంగావున్నా నీకు కూడ మనస్సులో ఆ బాధ ఒకమూల వుంటూనే వుంటుంది. ప్రపంచకంలో ఎంతమంది ఇటువంటి రాక్షస కృత్యాలకు బలిఅవుతున్నారో? తల్లిదండ్రులే బిడ్డల గొంతుకలు కసాయివాడిలాగ కోస్తున్నారు. మీఇద్దరికి ఇష్టమయినప్పుడు మీ తండ్రి సంతోషంగాచేస్తే ఈబాధ నీకుండదుకదా? పాపం ఆ పిల్ల తల్లిదండ్రులు ఎంత దుఃఖిస్తూవుంటారో?" అంది ఆవిడ. చూడుపద్మా ఈకథ ఏ పుస్తకానికయినా పంపిస్తాను. ఏంబాబు ఏమంటావు. "మీఇష్టం అక్కగారూ. ఇటువంటి రాక్షస కృత్యాలు జరగకుండగా నావంటి పిరికివాళ్లు ఎవరయినావుంటే నాకథ చదివాకైనా ధైర్యంగా సంచరిస్తే చాల సంతోషిస్తాను." ఇంక మాట్లాడలేక బయటకు వెళ్లిపోయాను.